# "వ్యథ"

రచన: శ్రీ. ద్విభాష్యం రాజేశ్వరరావు

విశ్వనాథం సముద్రపొడ్డునకూర్చుని శూన్యంలోకి చూస్తున్నాడు! వ్యథతో నిండిన మనస్సులా సముద్రం ఘోషిస్తోంది! విశాఖ పట్టణ పభావానికి కాపలాకాస్తున్న పెద్ద గోడలా దిక్చక్రం మసగ్గా కన్పిస్తోంది! ఓడ రేవు చేసుకున్న పుణ్యానికి ప్రతినిధిగా నిల్చి వుంది డాల్ఫిక్స్‌నోస్!

మసగ్గా చీకట్లు కమ్ముకుంటున్నాయ్! విశ్వనాథం శూన్యంలోకి చూస్తూ అలోచిస్తున్నాడు! కొంచెం దూరంలో పిల్లలు కేరింతలతో, కళ్ళల్లోపడే ఇసుకని, ఇతర ప్రపంచాన్ని లెక్కచెయ్యకుండా ఆడుకొంటున్నారు! వాళ్ళ సుఖంచూస్తే జుగుప్సకల్గింది విశ్వనాథానికి! ఒక్కసారి చిన్న కుర్రాడిగా మారిపోయి వాళ్ళతో కలిసి ఆడుకొంటే బాగుండు ననుకున్నాడు! ప్రక్కనుంచి ఎవరో గంటతో శబ్దంచేస్తూ వేరుశెనగపప్పు అమ్ముతున్నాడు! అవి కొనుక్కుతింటే బాగుంటుందని జేబులు తడుముకున్నాడు! ఇరవై పైసలు కన్పించాయి! అవి ఖర్చుపెట్టేస్తే మళ్ళీ కాఫీ త్రాగటం కుదరదని ఆ ఆలోచన విరమించుకున్నాడు!

ప్రస్తుతం విశ్వనాథం మనస్సంతా మొద్దుబారిపోయి ఏపుగాపెరిగిన బొమ్మజెముడు డొంకల్లా వుంది! ఇంటిగురించి ఆలోచిస్తే ఆ డొంకలు కదిలి మనస్సుకు ముళ్ళు గుచ్చుకుంటాయని ఆ తలపు రాకుండా ఆలోచిస్తున్నాడు!

ఏది కోరుకుంటే అది జరిగిపోయే మంత్రం తనకు యెవరైనా ఉపదేశిస్తే బాగుండు ననుకున్నాడు! అప్పుడు తను కావల్సినంత డబ్బు కోరుకోవచ్చు! ఉహు! డబ్బుకంటే ముందు తను ఏదైనా పెద్ద వింతచేసి ప్రపంచానికి చూపించాలి! అప్పుడు లోకంలో అందరికీ తన మీద అపరిమితమైన గౌరవం కలుగుతుంది! ఏ వింతచేస్తే బాగుంటుందా! అని మళ్ళీ ఆలోచనలో పడ్డాడు!

'రాత్రివేళ సూర్యోదయం చేయిస్తే!' విశ్రాంతి పొందుతుంది లోకమంతా! ఉహు! దానికంటు మిన్ను కొంతభాగం విరిగిపోయి సముద్రంమీద పడితే బాగుంటుంది! అపుడు సముద్రం పొంగి గలీజుగావున్న విశాఖపట్నం వీధుల్ని కొంత బాగుచేస్తుందనుకున్నాడు!

విశ్వనాథానికి కొంచెందూరంలో ఎవరో క్రొత్తజంట కూర్చొని విలాసంగా కబుర్లు చెప్పుకుంటున్నారు! చిలకలాటి ఆ అమ్మాయి కట్టుకొన్న చుక్కలచీర సీతాకోక చిలుక రెక్కల్లా గాలికి రెపరెపలాడుతోంది! ఆ అమ్మాయి నోరు గుండ్రంగా చిన్నదిగావుండి చూడటానికి ముద్దొస్తోంది! ఒక్కసారి దగ్గరగా వెళ్ళి పలకరిద్దామనుకున్నాడు! కాని ప్రక్కనున్న వ్యక్తి కాస్త దారుఢ్యంగా వుండటంచేత తన ఆలోచన విరమించుకొని నీరసంగా ఊహాలోకంలో పడ్డాడు!

× × ×

విశ్వనాథం విశాఖపట్నంలో వున్న ఒక చిన్న హైస్కూలు లేబరేటరీలో 'అటెం

డరు'గా పనిచేస్తున్నాడు! లేబరేటరీలో వున్న వస్తువులన్నిటిలోకీ ఒకమూలగా అద్దాల పెట్టెలో వేళ్ళాడదీసిన అస్థిపంజరం అతనికి బాగా నచ్చింది! దాన్ని చూస్తూ గంటల తరబడి కాలాన్ని గడిపేస్తాడు విశ్వనాథం! కారణం తనకీ దానికీ పోలికల్లో కొంత దగ్గర సంబంధం వుండటమే!

తను పురుషుడనిపించుకోడానికి పురుష లక్షణాల్లో ముఖ్యమైన ఉద్యోగంలో చేరినా, క్రమేణా అది తనచుట్టూ వలయంలా ఏర్పడి గోడకట్టి తనని బంధిస్తుందని మాత్రం ఎప్పుడూ అనుకోలేదు! ఆ అనుమానం ఊహా మాత్రంగానైనా కలిగివుంటే చిన్నతనంలోనే ఇల్లువదలి పారిపోయివుండేవాడు! కాని తను

Grams ; "MONOBLOCK" Phone : 3472

**SRI LAKSHMI FOUNDRY,**
**PATEL ROAD .... COIMBATORE.**




**శ్రీలక్ష్మి ఫౌండ్రి**
పటేల్ రోడ్.. ...కోయంబత్తూరు

Manufacturing 3/4 H.P. to 20 H.P. — 3 Phase Motors 960, 1450 & 2890 R.P.M. 2 H.P. to 20 H.P. —2 Phase Monoblock Sets. 1/2 H.P. to 2 H.P. — Single Phase Motors.

Dealers :- M/s. SIVARAJ ELECTRICALS No 53. Linghi Chetty Street, Madras-1.
Sole Agents for Eastwhile Hyderabad & Maharashtra State. M/s Vijai, Agencies, Giriraj Lane, Bank Street, Hyderabad-1.
Agents for Cuddappah, Dt :- M/s. V. S. REDDY, & Co., 4/189, Dr. AYYASWAMI PILLAI St., CUDDAPPAH (A.P.)

ఎటెండరుగా చేరిన కొన్ని దినాల్లోనే తండ్రి గుమాస్తా గిరీనుంచి రిటైరై కుటుంబభారం అంతా తనమీద పడేసి ఇనుపసంకెళ్ళతో బంధించాడు! అవి తెంపుకొని పారిపోలేక ఉద్యోగం సాగిస్తున్నాడు! తన చిన్నతనంలో తండ్రి ఆఫీసుఫైల్సులో తలదూర్చి నిరంతరం పని చేస్తూవుంటే ఈ గుమాస్తాలనందరినీ దేముడు కలెక్టర్లుగా మార్చేస్తే బాగుండు ననుకునేవాడు! ఇపుడు తనలాటి అటెండర్ల నందరినీ పెద్ద ఇంజనీర్లుగా మార్చేస్తే బాగుండునన్న ఆలోచనకూడా అప్పుడప్పుడు కలుగుతూ వుంటుంది!

అయితే విశ్వనాథం ఇంతవరకూ అనుకున్న వాటిలో ఒకటిరెండు తప్ప ఏవీ జరగలేదు! చిన్నతనంలో ఆడుకొనేందుకు ఒక చిన్న చెల్లివుంటే బాగుండుననుకున్నాడు! ఆకోర్కె-మూడింతలయి తీరింది! చిన్నచెల్లి ఇంకా సెకెండుఫారం చదువుతున్నా మిగతా ఇద్దరూ పెళ్ళివయసుల్ని కొంచెం తేడాతో అధిగమించి తనమెడకు గుదిబండలయి కూర్చున్నారు!

ఈ ముగ్గురే కాకుండా తల్లి, తండ్రి, భార్యనూ పోషించే బాధ్యతకూడా తన ఎనభైరూపాయల ఉద్యోగంతో ఈడ్చుకొస్తున్నాడు! పెళ్ళయిన కొత్తలో విశ్వనాథం భార్య చాలా అందంగావుండేది! జోలెడు మంచిమంచి చీరలతో విశ్వనాథం జీవితంలో అడుగుపెట్టింది! కాని ఈ అయిదేళ్ళలోనూ ఆమె అసలురూపాన్ని మరిచిపోయింది! ఇప్పుడు ఆమెముఖంలో అందం, ఆకర్షణ కల్పించకపోయినా, చీరలకోసం, చిరుతిండి కోసం వ్యాపించిన కోరికలరేఖలు ఆమె ముఖంలో స్పష్టంగా కన్పిస్తూవుంటాయి!

ఈ సంసారసాగరాన్ని రాక్షసులందరూ ఒకవైపు, తనుఒక్కడూ ఒకవైపు నిల్చుని మధిస్తున్నట్టు అప్పుడప్పుడు ఫీలవుతాడు విశ్వనాథం! అయిదేళ్ళగా అప్పులతో సంసారాన్ని నెట్టుకొస్తున్న అతనికి; అప్పు దొరకని నాడు, ఇంట్లో వస్తువులు నిండుకొన్ననాడు, భార్య చీరలుకొనమని అడిగిననాడు, సముద్ర వొడ్డుకు వచ్చి వైరాగ్యంతో పదిగంటల వరకూ గడిపి ఇంటికిపోవటం అలవాటయి పోయింది!

\+ + +

ఈరోజు, అంటే ఇరవైఏడో తారీఖు, సాయంత్రం ఇంటికివచ్చేసరికి భార్య నొప్పులు పడుతోంది! డాక్టర్ని, మంత్రసానిని తీసుకు రమ్మని ఆర్డరు జారీచేసింది తల్లి! ఇదికాక ఇరవైరూపాయలకు తగిన సరకుల లిస్టు తయారుచేసి ఇచ్చింది! ఎలాగైనా అప్పు చేసైనా తీసుకురమ్మని! కాళ్ళరిగేటట్టు తిరిగినా, ఇరవైరూపాయలు కాదుగదా ఇరవై పైసలుకూడా దొరకలేదు! జేబులోమాత్రం ఇరవైపైసలు మిగిలి నెలాఖరును సూచిస్తూ దీనంగా ముఖాలు మాడ్చుకొంటున్నాయ్!

కొంపలు మునిగిపోయినట్లు తనభార్యకు అప్పుడే తొమ్మిదినెలలు నిండిపోవాలా! ఈ పడేబాధ ఒకటోతారీఖు దాటినతరువాత పడకూడదూ! దేముడు కాన్పురోజుల్ని నెల మొదటివారంలో ఫిక్సుచేస్తే బాగుంటుందను కున్నాడు!

పదిరూపాయలనోటు చూపిస్తేగాని డాక్టరు తనతో మాటయినా మాట్లాడడు! మంత్రసానిని బ్రతిమాలి ఇంటికి పంపించి కాళ్ళీడ్చుకొంటూ సముద్రపొడ్డుకు వచ్చి మోకాళ్ళలో తలదూర్చి కూలబడ్డాడు విశ్వనాథం! ఇప్పుడు ఇంటికివెళ్తే ఆకలితో ఉదయంనుంచీ నకనకలాడుతున్న చెల్లెళ్ళు, వయసయిపోతున్న తలితండ్రులు, మరణవేదనలాటి ప్రసవవేదననుభవిస్తున్న భార్య వరుసగా కన్పిస్తారు! ఏదో డబ్బుతెస్తాడనే ఆశతో తనకోసం కళ్ళల్లో వత్తులువేసుకొని యెదురుచూస్తూ వుంటారు!

ఇంటిసంగతి జ్ఞప్తికి వచ్చేసరికి మళ్ళీ మనసు బాధతో నిండి ఒళ్ళంతా బరువెక్కింది! తన ఆలోచనలనుంచి తేరుకొనేసరికి బాగా చీకటిపడిందని గ్రహించాడు విశ్వనాథం!

రోడ్డుమీద దీపాలు మసగ్గా వెలుగుతున్నాయి! బీచ్ అంతా ఖాళీ అయిపోతోంది! కాళ్ళీడ్చుకొంటూ ఇంటికి వెళ్ళిపోయే వాళ్ళంతా ఏదో దుఃఖప్రపంచంలోకి సాగిపోతున్న అనాదల్లా కన్పించారు విశ్వనాథంకంటికి!

గతిలేక తానుకూడా నీరసంగా లేచి మెల్లిగా నడక ప్రారంభించాడు! 'కె. జి. హెచ్.' రోడ్డు ఎక్కుతూవుంటే యెవరో వెనక్కుపట్టుకొని లాగుతున్నట్లు కాళ్ళు పీకుతున్నాయి! ప్రక్కనున్న హోటల్లో దూరి కాస్త కాఫీ కడుపులోపోసుకొని ఇంటివైపు నడక సాగించాడు విశ్వనాథం!

ఇంటిలో అడుగుపెట్టేసరికి దీనంగా తల్లి ఎదురొచ్చింది! 'ఏరా బాబూ! ఇంతసేపూ ఏం చేస్తున్నావ్! ప్రక్కయింటివాళ్ళదగ్గర బియ్యం బదులుపుచ్చుకున్నాన్లే! కాస్త ఎంగిలిపడుదువుగాని రా!' అంటూ లోపలికి సాగిపోయింది! ప్రక్కనుంచి భార్య వేదన



USE ALWAYS
ARUNA
BANIANS
అరుణా
బనియన్లనే ఉపయోగించండి.
అవి:-చిరకాల మన్నికకు-రకానికీ అత్యుత్తమమైనది.
అత్యుత్తమమయిన సాదా, వల బనియన్లు, నూలు స్వెట్టర్లు, ఉత్పత్తిదారులు.
THE ARUNACHALAM KNITTING FACTORY
KARUR
(S. I.)
ది అరుణాచలం నిట్టింగ్ ఫ్యాక్టరి.
కరూర్ (S.I.)

మూలుగులరూపంలో స్పష్టంగా విన్పిస్తోంది! ఆమెవద్దకు వెళ్ళలేక తిన్నగా నూతివద్దకు వెళ్ళి కాళ్ళుకడుక్కొని కంచంముందు కూలబడ్డాడు! ఎంత ఆకలివేస్తున్నా గొంతుకలోకి మాత్రం ముద్ద దిగటంలేదు! అలాగే వేళ్ళు పెట్టి కతికేసి చెయ్యికడుక్కొని కుక్కిమంచం మీద నడుంవాల్చాడు.

ఏమాత్రం ఖాళీవున్నా ఆ కాలాన్ని వృధా చెయ్యకుండా బాధలతోకూడిన ఆలోచనలు విశ్వనాధాన్ని వెంటబడతాయి! వాటికి చిన్నతనంనుంచీ అలా వెంటబడి అతన్ని భయపెట్టటం, సరసాలాడుకోవటం పరిపాటయిపోయింది!

విశ్వనాధం మనస్సు విశాఖపట్నం రోడ్లలాగ గలీజుగావుంది! వాటిమీద కంట్రోల్లేని వాహనాల్లా ఏవో ఆలోచనలు తిరుగాడుతూ దుమ్ము రేపుతున్నాయి! భార్య ప్రసవవేదన చెవిని బడుతూంటే ఏదో బాధతో మనసును పిండుతున్నట్టనిపించింది విశ్వనాధానికి! ఇప్పుడు భార్య ప్రసవిస్తే మళ్ళీ కుటుంబానికి మరొకసంఖ్య పెరుగుతుంది! ఇక రేపటినుండి పాలడబ్బాలు, మందులు, చొక్కాగుడ్డలు, ఇవన్నీ తల్చుకొంటూవుంటే గుండె చెరువగుతోంది! గట్టిగా కళ్ళుమూసుకుని మనస్సులో అనుకున్నాడు, 'హే! భగవాన్! ఎందుకు మాలాటి మనుష్యుల్ని సృష్టించి ఆడుకుంటావ్! ఇన్ని బాధల్ని ఎందుకు సృష్టిస్తున్నావు దేవా! ఈ దారిద్ర్యంతోటీ, రోగాలతోటీ నిండిన ఈ లోకాన్ని యెలా పాలిస్తున్నావు'?

కళ్ళు తెరిచేసరికి పాలిపోయిన ముఖంతో తల్లి ఎదురుగావుంది! ఆమె చెప్తున్న మాటలకంటే భయంతో వణికిపోతున్న ఆమె పెదవుల్ని స్పష్టంగా గుర్తించాడు విశ్వనాధం.

'పురుడు కష్టంమీద వచ్చేసిందిరా! తల్లి కులాసాగానే వుంది కాని...'

తరువాతది తనకు తెలుసు! ఆపివేసిన మాటల్లో హృదయాన్ని తునియల్ని చేసే సమ్మెటపోట్లు, రోజులతరబడి తిండిలేక మాడిపోయిన మనుష్యులు చేసే ఆక్రందనలు, తెలియని వేదనలు, ధ్వనులు వున్నాయి!

యముని మహిషపు లోహఘుంటలు ఘణేల్ మంటున్నాయ్!

'పోనీలే! అమ్మా!' అన్నాడు నిర్లిప్తంగా.

తల్లి నిర్ఘాంతపోయి కొడుకును చూస్తూ వుండిపోయింది.

Tel: "FRACTIONAL" Phone 4909

- SIMPLE CONSTRUCTION
- RELIABLE OPERATION
- SILENT RUNNING

S K M-Single Phase Motors.
S K P-Self Priming Centripetal Pumps.
S K M/S K P Unit Electric Pumping Sets.

EACH UNIT IS THROUGHLY TESTED
BEFORE DESPATCH

FOR DETAILS
PLEASE CONTACT MANUFACTURERS :—

SREE KRISHNA FOUNDRY
PAPANAICKENPALAYAM
COIMBATORE—1.